సంధ్యారుణకిరణాలు ప్రపంచమంతటా పరుచుకుని వున్నాయి. మెల్లిగా దివాకరుడు పశ్చిమాద్రిచాటుకు పోతున్నాడు. ఇంతవరకూ జరిగిన సంఘటనలన్నీ 'గతాలుగా మారటానికిది నాంది. సజీవ ప్రాణికోటి ఆయుర్దాయంలో ఒకరోజు మెల్లిగా చెరిపివేస్తున్నాడు కాలపురుషుడు. సంధ్యాదేవి, ఉదయంనుంచీ సూర్యుని వెన్నంటి పరుగెడుతోంది. సప్తాశ్వరథారూఢుడైన దినకరుడామె రాకను గుర్తించలేదు. రాబోయే ముందు చూపులోనే పరుగెడుతున్నాడు. సంధ్యాదేవి వగరుస్తూ ఆగిపోయింది. నిస్పృహలో నిలిచిపోయింది. తాను మార్తాండుని చేరుకోనలేకపోయింది. అతగాడప్పుడే పశ్చిమదిక్కోణంలో అడుగెట్టేశాడు! ఇప్పుడేం చేయాలి? వెనుక్కు మరలి పోలేనా? ఊహూఁ, వ్యవధిలేదు. పోనీ ఇక్కడే నిల్చుని రేపటిదాకా వేచివుండేనా? అందుకూ అవకాశంలేదు. అన్ని వేపులనుంచీ అంధకారం వ్యాపిస్తోంది. నిశారమ్య తనను గేలిచేస్తూ, గర్వంతో గంతులువేస్తూ వస్తోంది. సంధ్యాదేవి కర్తవ్య హాస్యయై, వెలాతెలాపోతూ నిల్చుంది. ఆమె సంధ్యారుణవర్ణం, సిగ్గుతో, అవమానంతో క్రుంగి, మ్లానమైంది. విజృంభిస్తున్న నిశాకన్యముందు, సంధ్య అవమానభారంతో తలవంచుకుని, ఆ చీకటిలో లీనమైపోయింది.

వనని నిర్మల ప్రభావతి

మెట్ల కిరువేపులా కూర్చొని అడుక్కునే నానాజాతి బిచ్చగాళ్ళూ, అంగ వికలులూ, తమ జోలెలూ, డబ్బాలూ, పాత్రలూ తీసుకుని దిగి వస్తున్నారు కొండ మీదినుంచి దిగివస్తున్న యాత్రికుల సంఖ్యకూడా పలుచబడుతోంది. చూస్తుండగానే మెట్ల బాటంతా నిర్మానుష్యమైపోయింది నల్లిశలా పరుచుకుంటున్న అంధకారాన్ని తొలగిస్తూ విద్యుద్దీపాలు వెలిగాయి దూరంనుంచి చూస్తే, మెట్ల ప్రక్కగా వెలుగుతున్న దీపాలు, కోటీశ్వరుడైన భక్తుడు, ఏడుకొండలవానిపై గల భక్తికి నిదర్శనంగా సమర్పించుకున్న వజ్రాలహారంలా వుంది!

మీనాక్షి మెల్లగా మొదటిమెట్టుమీద అడుగుపెట్టింది

ఎందరో చెప్పారు 'ఈ చీకట్లో, మెట్లదారిని పోతానంటావేం టమ్మా! తెల్లవారనీ బస్సులెన్నో వెడతాయి. లేదా పగలు ఎంతోమంది యాత్రికులు నడిచి వెళ్తుంటారు వారితోపాటు నువ్వూ పోదూగానీ...'

మీనాక్షి వినిపించుకోలేదు

ముప్పై సంవత్సరాలు పైబడి, జీవితంలో ఎన్నోరకాల అనుభవాలు చవిచూసిన తన కింకా చీకటిని చూచి భయ మేమిటి?

కానీ ఈమెట్లన్నీ ఈ నిశాసమయంలో తను ఎక్కగలదా? ఎక్కడేనా త్రోవ తప్పితే? మొక్కుపర్వతం ఎక్కటం మహాకష్టమంటారు అది అధిగమించటం సాధ్యమా? ఎక్కడేనా జారిపడితే? ఏ మెట్టుమీదనుంచి కాలుజారి అగాధంలో పడి నామరూపాలులేకుండా పోవాల్సిందే!

ఊహూఁ! అలా హతమైపోదు తను. ఈ మెట్లేమిటి? ఈ అంధకార మేమిటి! ఇంతకంటే ఎన్నో జీవితానుభవాల సోపానాలను అధిగమించి వచ్చింది తను! రాగద్వేషాల కతీతమైన సమస్థితి నీనాడు మనసు సాధించింది ఇంకా చీకటి వెలుగుల తారతమ్యమూ, జీవన్మరణములకు సంబంధించిన భీతీ తన కేమిటి?

మీనాక్షి కృతనిశ్చయురాలైంది

మెట్ల కిరువేపులా వున్న పలురకాల వృక్షాలమీదనుంచి, నానావిధపక్షి, క్రిమి కీటకాది ప్రాణికోటి రకరకాల శబ్దాలు చేస్తున్నాయి అమావాస్య దగ్గరపడుతున్న రాత్రి కావటంచేత, చీకటి దట్టంగా వ్యాపించింది. చుక్కలు మిగేలుమంటూ వెలుగుతున్నాయి. చీకటిలోనే తమ అందం ప్రస్ఫుట మౌతుందంటూ! పైన నింగి, క్రింద నేల, మధ్యలో తను!

మానవజీవితమే ఒక మహాకావ్యం. అందులోని వివిధ సంఘటనలే, నవరస భరితఘట్టాలు. వాస్తవిక జీవితంలోని కొన్ని దృశ్యాలే కొందరు కవుల రచనలకు

పునాదు లవుతుంటాయి... కానీ ఆ వాస్తవిక సంఘటనలలోకూడా కొన్ని నమ్మశక్యంకానంత అతిశయోక్తు లనిపించేంతటి అసహజంగానూ వుంటాయికూడా !

పాదాలు అడుగులు వేస్తున్నాయి. నోరు గోవిందనామసంకీర్తన చేస్తోంది. మనసు గత జీవితంలోని ఘట్టాలన్నిటినీ వరుసగా ఏర్చి, కూర్చి, చక్కటి కథలా రూపొందిస్తోంది ! మనోనేత్రంలా గతించిన ఘట్టాలను, దృశ్యాలుగా చూస్తున్నాయి.

చిన్నతనంలో మీనాక్షినిగురించి, ఎవరికేనా చెప్పేటప్పుడు పార్వతమ్మ కళ్ళల్లో కించిత్‌గర్వం తొణికిసలాడుతుండేది ! అంతలోనే దుఃఖంకూడా క్రమ్ముకు వచ్చే దామెకు.

"మా మీనాక్షి వయసుకు చిన్నదేకానీ, ఆలోచనాశక్తి ఎక్కువండీ. ఇంట్లో ఏదేనా గొడవ జరుగుతుందని పసికడితేచాలు, చిన్నవాణ్ణి తీసుకుని బయటికి వెళ్ళిపోతుంది. పిల్లాడు భయపడతాడని దానిభయం !"

అబ్బ ! ఎంత గడ్డురోజులు !

విశ్వనాథం డిగ్రీచదు వెలా చదివాడో, స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం ఎలా సంపాదించాడో, వూహాతీతమైన విషయంగా నిలిచిపోయినా, అతగాడికిత్రాగుడు మాత్రం సర్వస్వం అనేసంగతి మీనాక్షికి తెలుసు. విశ్వనాథం ప్రాణస్నేహితుడూ, మద్యపాన సహచరుడూ అయిన రామారావు, చీకటిపడగానే ఇంటిముందు నిలిచి,

"విశ్వం రావోయ్! అలా వెళ్దాం సరదాగా" అని కేక వెయ్యటమూ, "వస్తున్నా నుండరా రామూ! ఒసేవ్ పార్వతీ! నేనలా వెళ్ళొస్తా!" అని తండ్రి ప్రతిసమాధానం, మీనాక్షికి మూడోఏడు వచ్చినప్పట్నుంచే బాగా గుర్తు

ఆ "అలా" "సరదా" అనేమాటలకు, తప్పతాగి రావటమనే అర్థమని ఏడో సంవత్సరం వచ్చేలోపలే గ్రహించింది మీనాక్షి

తప్పతాగి తూలుతూవచ్చే అతగాడికి, త్రోవలోవున్న ప్రతి వస్తువునూ తన్నెయ్యటమే అలవాటు అవి సజీవ నిర్జీవ ప్రాణులనే భేదంకూడా గమనించడు

ఒకరోజు మీనాక్షి బొమ్మలకు చీరెలు సింగారించి, అలిసి, అలా నేలమీదే పడుకుంది విశ్వనాథం రావటమూ, ఆయన కాలిదెబ్బకు బంతిలా ఎగిరి, గోడకుపోయి తల తగలటమూ, ముఖంమీద కలిగినగాయం నాటికీ నేటికీ మచ్చగానే మిగిలిపోయింది మరెప్పుడూ ఆయన వచ్చేవేళకు అలా త్రోవలో పడుకోవటం కాదు సరికదా, ఎదురుగాకూడా రాలేదు ఒక్కోసారి పార్వతమ్మ నతగాడు కొడుతుంటే, గదిలో తలుపుచాటునుంచి నక్కి, నక్కి చూడటంమినహా మరేమీ చెయ్యలేకపోయేది.. బయటికి వస్తే, ఆదెబ్బలూ, తనకూ తగుల్తాయేమోననే భయంతో, అమ్మ దెబ్బలు తింటోందనే దుఃఖంతో, నాన్నమీద కోపంతో, వెక్కిళ్లు విన్పించకుండా గుక్క త్రిప్పి ఏడవటంకూడా పరిపాటైపోయింది

పార్వతమ్మ మీనాక్షిని దగ్గరకు తీసుకుంటూ అడిగింది, 'అమ్మాయీ! నీకు చెల్లెలు కావాలా? తమ్ముడుకావాలా' అంటూ

"తమ్ముడే కావాలమ్మా! బొద్దుగా తెల్లగావుండాలి నేనూ ఎక్కింటి శ్యామలలా, తమ్ముణ్ణి ఎత్తుకుని ఆడించుకుంటాను"

అమ్మ కళ్ళల్లో ఎందుకో నీళ్ళు రావటం చూసి ఆశ్చర్యపోయింది మీనాక్షి

"అలాగే అమ్మాయీ! నువ్వూ, తమ్ముడూ బాగా ఆడుకుందురుగానీ .."

అమ్మెందుకేడుస్తోందో అర్థంగాలేదు... రాత్రి నాన్న కొట్టినందుకేమో!

"నాన్నకింత కోప మెందుకమ్మా! నిన్నెందుకలా కొడతాడు," అంది సంశయంగా

"అబ్బే! కొట్టలేదమ్మా .. నేనే తట్టుకుని పడ్డాను ." అమ్మ ఏడుస్తూనే, నవ్వుతూ, అబద్ధం చెబుతోం దెందుకో!

వారంరోజులు తిరక్కుండానే, ఇంట్లో చక్కటిబాబు నిలిచాడు

శ్యామలావాళ్ళ తమ్ముడికంటెకూడా బాగున్నాడు బాబును "రవి" అంటోంది తను అమ్మకూడా అదేపేరు ఎంతో బావుం దంటోంది .. రవి దోగాడుతుంటే,



కూర్చుంటుంటే, నడుస్తుంటే, మీనాక్షి కెంతో ముచ్చట వేస్తోంది అస్తమానూ వాడితోడిదే లోక మయింది

కానీ ఒకే ఒక సందేహం పీడిస్తోంది.

బడికి పోతూ పోతూ, పిలవటానికి శ్యామలావాళ్ళింటికి వెళ్తుంది మీనాక్షి. అక్కడ తనకు కనిపించే దృశ్యం ఎంతో ఆశ్చర్యకరమైనది తన కేనాడూ అనుభవంలోకి రానిది. శ్యామలావాళ్ళ నాన్న, శ్యామల నొకవేపు, వాళ్ళ తమ్ముడి నొక వేపు ఒళ్ళో కూర్చోపెట్టుకుని నవ్విస్తుంటాడు మంచి మంచి కథలు చెబుతుంటాడు. ఒక్కొక్కసారి ఏవేనా కొనుక్కు తినమని డబ్బులుకూడా ఇస్తుంటాడుట!

మరి తన నాన్నో? ఎప్పుడూ దగ్గరకు రమ్మనడు పొరపాటున ఎదురుపడితే కసురుకుంటాడు ఓసారి రవి ఏడుస్తూ వెళ్ళాడు నాన్నదగ్గరకి పాపం! వాడి కేం తెలుసు తండ్రితత్వం! చెంప పగిలిపోయేలా కొట్టాడు' గబగబ పరుగెత్తి బాబును చంకనేసుక పరుగెత్తింది. ఎంతసేపటికో తగ్గాయి వాడి వెక్కిళ్ళు!

పార్వతమ్మ అప్పుడప్పుడూ పిల్లల్నిద్దర్నీ దగ్గర కూర్చోబెట్టుకుంటుంది...

''మీ రిద్దరే నా ప్రాణాలు తల్లీ!'' అంటూ ఏడుస్తుం దెందుకో

పిల్లలకూ ఏడుపొస్తుంది

''ఛ ఛ, ఏడవకూడదమ్మా! పాపిష్టిదాన్ని' పిల్లల్ని కంగారు పెట్టాను!'' ఆమె గబగబ కళ్ళు వత్తుకుంటుంది.

సాయంత్రం పెందరాడే అన్నం పెట్టి, ''ఇక పడుకోండమ్మలూ ! నాన్న వచ్చే వేళ్ళకు నిద్రపోతారుకదూ ? లేకుంటే నాన్న కోపం వస్తుంది.''

నిద్ర రాకున్నా, గదిలో రవిని పక్కలో పడుకోబెట్టుకుని కళ్ళు మూసుకుంటుంది మీనాక్షి ! నాన్న వస్తున్నశబ్దం తనకు బాగా పరిచయమే !

''ఆ నీలవేణి చూడు, నే వెళ్ళేసరికే రంభలా ఎదురొస్తుంది. నవ్వులతో కేరింతలతో కవ్విస్తుంది నువ్వూ వున్నావు ఎందుకూ ? చింపిచేటలా ! అస్తమానూ పిల్లల్ని వెంటేసుకుని మడిదానిలా...''

ఒకరోజు విశ్వనాధం కేకలు ఇంట్లో ప్రతిధ్వనిస్తున్నాయి ! ''ఆ నీలవేణి'' ఎవరో అర్థం కాలేదు... కానీ ఎప్పుడూ లేనిది అమ్మ ఈరోజు రెచ్చిపోయి, జవాబు చెబుతోంది నాన్నకు !

''ఇంటి పనిపాటలూ, పిల్లల సంరక్షణా మానుకుని, రంభలా మిమ్మల్ని కవ్వించటానికి నే నేం ఆ పడుపుముండని కాదు. నా కా బిడ్డలే సర్వస్వం మీకోసం వాళ్ళనికూడా సరిగా చూడటం లేదు. మీరు వచ్చేసరికే వాళ్ళని అన్నాలుపెట్టి గదిలోకి తరిమేస్తున్నాను... ఏనాడేనా తండ్రి ఆదరణ వాళ్ళకుందా ? ఏ నిముష మేనా ప్రేమగా దగ్గరకు తీసుకున్నారా వాళ్ళను ? పెద్దదానికి ఊహ తెలిసింది కాబట్టి, అది మీ ఛాయలకే రాదు ! వాడు మిమ్మల్ని చూస్తేనే హడలి పరుగెత్తుతాడు ! ఇంకా రంభలా అలంకరించుకుని ఎదురుపడాలని, అనటానికేనా నో రెలా వస్తోంది ! మీ కా తాగుడూ, ఆ సానివాళ్ళే సర్వస్వం...కానీ నా కా బిడ్డలేప్రాణం !''

అమ్మ ఒళ్ళుమరచి అరుస్తోంది.

''ఎదురు చెప్పటం కూడా నేర్చుకున్నావే !'' నాన్న దెబ్బలచప్పుడులో, అమ్మ ఏడుస్తూ అంటున్న మాటలు విన్పించటం లేదు ! భయంతో గడ్డకట్టుకుపోయింది మీనాక్షి ! ఇలాటి సమయంలో రవి లేస్తే ! అమ్మయ్యో ! భయపడి పోడూ ? రవిని మరింత దగ్గరగా లాక్కుని పడుకుంది !

వారం రోజులుగా పార్వతమ్మ జ్వరం విశ్వనాధానికి చీమకుట్టినట్లయినా లేదు ఎప్పుడో వస్తాడు... వచ్చినట్లుగానే వెళ్ళిపోతాడు !

పక్కింటిపిన్ని సాదకాలు ఇస్తోంది అన్నంమాత్రం వండుతోంది మీనాక్షి, ఆమెకు మందులు ఇస్తూ !

''అమ్మలూ !'' పార్వతమ్మ మెల్లిగా పిలిచింది.

ఔన్సుగ్లాసులో మందు వంచుతూ, అదక్కడే పెట్టి, గబగబ దగ్గరకువచ్చింది మీనాక్షి.

తల్లి శరీరంలో, చూపులో కూడా ఏదో తెలియని భేదం కన్పిస్తోంది...

"ఏమ్మా?"

''తమ్ముణ్ణి జాగ్రత్తగా చూచుకుంటావుగదూ?'' అమ్మ కళ్ళల్లో నీళ్ళు, అప్పటి కప్పుడు గంగాజలంలా పూరి నదిలా ప్రవహిస్తున్నాయి చెంపలమీదుగా...

''చూస్తానమ్మా!''

అమ్మ హృదయానికి హత్తుకుంది ఘట్టిగా!

సంజెచీకట్లు, మెల్లిగా చిక్కబడుతున్నాయి.

హఠాత్తుగా పార్వతమ్మ పలకటం మానేసింది! గుండెదడ ఎక్కువౌతోంది మీనాక్షికి! ఇల్లంతా చీకటి! రవి, తనుతప్ప ఎవ్వరూ లేరు... పెరటిగోడదగ్గరికి పరిగెత్తి పక్కింటి పిన్నిని కేకేసింది...

''పిన్నీ! పిన్నీ! అమ్మ పలకటంలే దెందుకో... నాకు భయం వేస్తోంది... రవి ఏడుస్తున్నాడు... ఒక్కసారి రా పిన్నీ!''

ఆకలి మందగించటం

అజీర్ణమందు రోజీ కేరపోవటం కొంచెంగా జ్వరం మొదలైన గుణములు పిల్లలలో లివర్ స్ప్లీన్ వ్యాధి మూలవటం కావచ్చు.

వెంటనే జమ్మివారి సలహా తీసుకోండి.

జమ్మివారి లివర్‌క్యూర్

పసిబిడ్డల లివర్, స్ప్లీన్ వ్యాధులకు

పరమౌషధము

వ్యాధి లక్షణాలను ఆదిలోనే గుర్తించండి!

ఆకలి మందగించటం – అజీర్ణం – చిరాకుగా ఏడుస్తూండటం – కొంచెంగా జ్వరం – పొట్ట పెరగటం – ఉబ్బరంగుగా లేదా తెల్లగా విరేచనం.

జమ్మివారి డాక్టర్లు ముఖ్యమైన పట్టణాలకు ప్రతి నెలా వస్తారు వివరాలకు వ్రాయండి!

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్

"Mahendra Nivas" 1-1-189-19A, Viveknagar, Musheerabad-P O.
Chikadpalli-Hyderabad-20, H.O. Madras-4

Branches: Bombay-4, Bengalore-2, Calcutta-7, Delhi-6;
Nagpur-1, Lucknow-1, Trichi-2 & Kumbhakonam.

ఆవిడ హడావుడిగా వచ్చింది.

'నేను ఈ బాబుని చూస్తుంటాను మీనాక్షీ! నువ్వెళ్ళి మీ నాన్నగారిని పిల్చుకు రామ్మా' ఊ! త్వరగా!"

తన కేమీ కన్పించటం లేదు. పరికిణీ పైకి పట్టుకుని, ప్రాణాలు పిడికెట్లో పట్టుకుని పరుగెత్తుతోంది రామారావుగా రింటిముందు ఆగేసరికి వగరుస్తోంది...

"నాన్న వచ్చాడాండీ? మా అమ్మ పలకటం లేదు..." కంగారులో, దుఃఖంలో మాటకూడా రావటంలేదు

రామారావుగారి భార్య లక్షమ్మ, పిల్లాణ్ని చంక నేసుకు వచ్చింది... "ఇక్కడికి రాలేదమ్మా, ఎక్కడ డుంటారని వెతుకుతావు తల్లీ! నే వస్తా పద..." ఆమె వచ్చింది

పార్వతమ్మ కొద్దిగా కళ్ళెత్తి చూచింది

"అమ్మలూ, మీ నాన్న రాలేదూ ?"

"ఊహుఁ"

"ఎక్కడున్నారు ?"

'ఎక్కడుంటారు పార్వతమ్మా' మీ ఆయనకూ, మా ఆయనకూ ఓ ఇల్లని నియమం వుందా ?" లక్ష్మమ్మ కళ్ళలోకూడ నీళ్ళు నిలిచాయి

"పిల్లలను జాగ్రతగా చూడమని, నా మాటగా వా రొస్తే చెప్పండి లక్షమ్మగారూ. ఇక నా కే కోరికా లేదు..." అమ్మ మూతలుపడుతున్న కనుకొలకుల్లో రెండేరెండు నీటి బిందువులు అలాగే నిలిచిపోయాయి!

లక్షమ్మగారు ఏడుస్తూ కంగారుగా బయటికి పరుగెత్తి, అందర్నీ కేకలేసింది! పరిస్థితి కొద్దికొద్దిగా అవగాహన కాగానే మీనాక్షి దుఃఖం కట్టలు తెంచుకుంది. ఏదీ తెలియని రవి అయోమయంగా ఏడుస్తున్నాడు

ఇరుగుపొరుగువారంతా పోగయ్యారు

"ఇకనయినా ఆ పాపిష్టివా డెక్కడున్నాడో పిల్చుకురండి ఎవరేనా!" పక్కింటి రామయ్యగారి కేకతో, ఎవరో వెళ్ళారు.

కాస్సేపట్లో విశ్వనాథం వచ్చాడు. భార్య మృతకళేబరంమీద పడి ఏడ్చాడు.

"వెధవ! వెధవ ఏడుపూ వీడూను. బ్రతికుండగా ఆ ఇల్లాలిని కన్నెత్తి చూచాడా ?" అంటున్నా రెవరో

"ఇప్పుడుమాత్రం ? అది నిజంగా ఏడుపే నంటావా' త్రాగుబోతువాడికి ఏడు పెంత సేపులో రావాలి ? నవ్వెంతలో రావాలి ?" మరెవరిదో గొంతు...

పార్వతమ్మ నిర్జీవ శరీరంకూడా, పిల్లలమధ్యనుంచి మాయమైంది.

మర్నాడే పార్వతమ్మ తల్లీ, తమ్ముడు వేణూ వచ్చారు కబురు తెలిసి విశ్వనాథాన్ని వాళ్ళేవేవో తిట్టారు

''పిల్లల్ని మేం తీసికెడతాం, నా బిడ్డను చంపినట్లే, వీళ్ళనీ ముగిస్తావు...'' అంది అమ్మమ్మ ఏడుస్తూ...

''నాన్న చంపలే దమ్మమ్మా, అమ్మే చచ్చిపోయింది...'' మీనాక్షి మాటలు మధ్యలో వుండగనే అమ్మమ్మ కేకలేసింది.

''ఇంకా అవొక్కటే తక్కువ తల్లీ, చంపలేదులే మీ నాన్న... చచ్చేలా చేశాడు...!'' అమ్మమ్మ పొంగివస్తున్న దుఃఖాన్ని అణచుకొనబోయిందేగానీ, అది ఆగలేదు.

విశ్వనాథం అన్నీ వింటూ మౌనంగా వున్నాడు. దేనికీ జవాబు చెప్పటంలేదు.

* * * *

అమ్మమ్మగారి వూరుచూచి చాలా ఏళ్ళయింది. తన కెప్పుడో ఐదోఏట కాబోలు, అమ్మతో ఇక్కడికి వచ్చింది పచ్చని పంటపొలాల గట్లమీద, కుతూహలంగా నడిచింది మీనాక్షి. వేణు మామయ్య వేలుపట్టుకుని జొన్నచేలు చూస్తూ, మామయ్య కొట్టిఇచ్చే చెరుకులు తింటూ ఎంతదూరం నడిచినా అలసటరాలేదు.

కపిలబావులూ, ఆ బావులలోనుంచి పెద్ద బక్కెట్లతో నీళ్ళు తోడుతూంటే. తన కెంతో వింతగా వుండేది. అల్లాగే గంటలతరబడి నిల్చుండి, చూస్తుండిపోయేది ఆ దృశ్యాన్ని. అప్పుడు తన కన్నీ తమాషాలే! ఆశ్చర్యార్థకాలే! పాలు పితకటం, పైరుకోయటం, కుప్ప నూర్చటం, ఏదో వాళ్ళు పాడేపాటలూ, ఏతాము, బండ్లు తోలుకురావటం, ఒకటేమిటి, పల్లెలో కనిపించే ప్రతి దృశ్యమూ తనకు కొత్త వింత! ఒక్కోసారి అలాటి వేహో చూస్తూ, ఎంతకూ ఇంటికి రాకుంటే, అమ్మ సన్నసన్నగా చివాట్లు పెట్టేది మామయ్య నవ్వేవాడు .

''దీన్నో మోతుబరీ రైతు కిచ్చి పెళ్ళి చేసేద్దాం అక్కయ్యా. పల్లెటూళ్ళో వుంటూ, నోరు తెరుచుకు చూస్తుండొచ్చు జీవితాంతం.. ''

అమ్మ, అమ్మమ్మ అందరూ నవ్వేవాళ్ళు

మళ్ళీ ఇప్పుడా పల్లెటూరికి వస్తోంది ఇది ఇక్కడే వుండాలని చెబుతోంది అమ్మమ్మ

అమ్మ చనిపోయింతర్వాత రవికి మరీ భయం ఎక్కువయింది ఎవ్వరిదగ్గరకీ రాడు... అందరివేపూ బెదిరిచూస్తాడు ఒక్క అక్కదగ్గరే వాడికి చనువూ, నిర్భయమూ, అస్తమానూ అంటిపెట్టుకు వుంటాడు, అమ్మమ్మ దగ్గరకూడా వెళ్ళడు... వేణుమామయ్యను చూచినా వాడికి భయమే రాధమ్మత్తయ్య దగ్గరికి ససేమిరా వెళ్ళదేమిటో!

మామయ్య కొడుకు రమేష్, సరిగ్గా రవి వయసువాడే వాడూ ఇప్పుడిప్పుడే అన్నిమాటలూ స్పష్టంగా చెప్పగలుగుతున్నాడు రవిలానే. రవీ, రమేష్ జట్టుగా ఆడుకుంటున్నారు... కొద్దికొద్దిగా రవి అమ్మను మర్చిపోగలుగుతున్నాడు

* * * *

మీనాక్షి సెకెండుఫారమ్‌లో చేరింది. పూర్వంలా ఇప్పుడు కపిల బావులనూ, దున్నుతున్న అరకలనూ, కోతల కూలీలనూ, కళ్ళార్పకుండా చూడాలనే కుతూహలమూలేదు... వూరుకూడా చాలా మారిపోయింది ఆ పెద్దబావుల దగ్గర ఇంజన్లు పెట్టారు ఎలిమెంటరీ బడిగా వున్న ఆ చిన్నపాక స్థానంలో ఇప్పుడు పెద్ద భవనమూ, అందులో హైస్కూలు వెలిశాయి కిరసనాయిలుబుడ్డి దీపాలు పోయి, కలవారికి విద్యుద్దీపాలూ, కొద్దివారికి పెద్ద లాంతర్లూ వచ్చాయి... మనుషులూ మారారు. కొత్తగా నాగరికత నేర్చుకొన్నారు... రోజులు చల్లగా, ప్రశాంతంగా సాగిపోతున్నాయి స్కూలు కెళ్ళిరావటమూ, రవి, రమేష్‌లతో ఆడుకోవటమూ, అత్తయ్యకూ, అమ్మమ్మకూ పనిచేయ్యటమూ, రాత్రి కాగానే

యువ

రవిని నిద్రపుచ్చి పుస్తకాలు పట్టుకు చదువుకొని. నిద్రపోవటమూ దినచర్యగా మారింది.

ఆ రోజెందుకో బడినుంచి వచ్చేసరికే అందరూ ముభావంగా వున్నారు. ఏమీ అర్థంగాలేదు మీనాక్షికి...అమ్మమ్మ కళ్ళు వత్తుకుంటోంది. "ఏమిటమ్మమ్మా ఏడుస్తున్నా వెందుకూ?'' మెల్లిగా పక్కకు జేరి అడిగింది మీనాక్షి.

''ఏమని చెప్పనమ్మా, ఏం చెబితే నీ కర్థమవుతుంది ? ఏనాడూ ఇక తండ్రి వున్నాడనే ఆశకూడా లేకుండా చేశాడు అప్రాచ్యుడు.'' అమ్మమ్మ కళ్ళు తుడుచు కొంటూంది.

అర్థం కాలేదు

మామయ్య చీదరించుకుంటూ లోపలికి వచ్చాడు ''అక్కయ్యను మింగింది చాలక, మరోపిల్ల గొంతు కోశాడు దరిద్రుడు. ఇద్దరు పిల్లలు అందులోనూ బాగా వూహ తెలిసిన పెద్దపిల్లుందనే ఆలోచనేనా లేకుండా, ఈ వయసులో... రెండోపెళ్ళి చేసుకునేవాడికి లేకపోయినా, పిల్ల నిచ్చేవాళ్ళకేనా లేకపోయింది కాబోలు "

కొద్దిగా అవగాహ నయ్యింది ''ఎవ రమ్మమ్మా" మెల్లిగా అడిగింది.

"ఇంకెవరమ్మా ? మీ నాన్న ! మరో అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడట... అంటే మీకు సవతి తల్లిని తయారుచేసి పెట్టాడన్నమాట ''

సవతితల్లి ! సవతితల్లులను గురించిన కథలెన్నో తను విన్నది. సినిమాలలో కూడా చూచింది వాళ్ళెంతో దుర్మార్గులు, పిల్లను చంపుకు తింటారట, అష్ట కష్టాలూ పెడతారట. ఆ రాత్రంతా నిద్రపట్టలేదు మీనాక్షికి. ఆమె లేతహృదయంలో సవతితల్లుల రాక్షసకృత్యాలను గురించిన అనేక దృశ్యాలూ, ఘట్టాలూ- తలలెత్తు తున్నాయి. ఇప్పుడు నాన్న పెళ్ళి చేసుకున్న ఆమె ఎలా వుంటుందో, పేరేమిటో ఒకవేళ ఎప్పుడేనా నాన్నను చూడాలని, రవిని వెంటబెట్టుకునిపోతే, తమను ఏం చేస్తుందో ? అనేక కుశంకలు పొడసూపుతున్నాయి. అసలెందుకు వెళ్ళటం ? తను, రవి, చక్కగా ఇక్కడే వుండి చదువుకుని, పెద్దవాళ్ళవుతారు. సవతితల్లి దగ్గర కష్టా లెందుకుపడాలి ?

ఇలాటి వూహ రాగానే, మీనాక్షి హృదయం కాస్త తేలికపడింది రవిని మరో సారి శరీరమంతా నిమిరి పడుకుంది. పిచ్చివెధవ ఎప్పుడో తప్ప అమ్మనుగురించి అడగటంలేదు.

''అమ్మ ఇక మనదగ్గరకు రాదా అక్కయ్యా?" అంటాడు.

''వస్తుందిరా రవీ. మనం పెద్దవాళ్ళ మయ్యాక వస్తుంది.'' అని సమాధానం చెబుతుంది అబద్ధంతో.

''అలా అయితే మనం త్వరగా పెద్దవాళ్ళ మవుదాం అక్కయ్యా'' అంటాడు వాడు

"అల్లాగే...బజ్జో...'' మెల్లిగా చిచ్చికొడుతుంటే వాడు నిద్రపోతాడు. అప్పటి కా ఆలోచన మానేసి!

ఇప్పుడు వాడికి సవతితల్లిని గురించి చెప్పాలా? వద్దా? అనే ప్రశ్న వేధిస్తోంది! వద్దు... భయపడ్తాడో ఏమో!

తన క్లాసుమేటు జయకూడా సవతితల్లే! కానీ ఆవిడ జయనూ, వాళ్ళ చెల్లెలినీ ఎంత ప్రేమగా చూస్తుందనీ? ఎప్పుడూ తిట్టదు, కొట్టదు, కష్టాలుపెట్టదు... కోపంగా ముఖం పెట్టదు, చిరునవ్వు నవ్వుతూ, ఎన్నో కథలు చెబుతుందట! చక్కగా ముస్తాబు చేస్తుందట, ఒకసారి జయే చెప్పింది.

"మీనాక్షీ! మా అసలమ్మ అప్పుడప్పుడు కొట్టేది... ఈ అమ్మ అసలు కొట్టదు తిట్టదు... ఎంతో ప్రేమగా చూసుకుంటుంది...''

తన సవతితల్లి కూడా ఇలా ఎందుకుండకూడదూ? ఏమో!

ఇంట్లో అమ్మమ్మదగ్గ రెప్పుడు కూర్చున్నా ఇప్పుడు కొత్తగా వచ్చిన "పిన్ని" (సవతితల్లి)ని గురించిన కథలే! మరి వీళ్ళ కప్పుడే ఆమెనుగురించి ఏం తెలుసో? మాటల సందర్భంలో పిన్ని పేరు "వసుంధర'' అనిమాత్రం తెలిసింది.

థర్డ్ ఫారమ్ సంవత్సరం పరీక్షలయిపోయాయి రవి, రమేష్ ఒకటోక్లాసులో చేరారు. చక్కగా చెడ్డీ చొక్కా లేసుకుని, భుజాలకు సంచీలు తగిలించి, చెట్టాపట్టా లేసుకుని బడికి వెళ్ళొస్తున్నారు. మామయ్యకు మరోపాప కలిగింది! బొద్దుగా చక్కగా వుంది!

కానీ ఎందుకో అత్తయ్యలో మార్పు వచ్చింది ఇంతకుముందులా, ప్రేమగా చూడటంలేదు. మాటిమాటికీ కసురుకుంటోంది! చిరాకు పడుతోంది! రవిని చూస్తే మరీను! మామయ్యకూడా మారిపోతున్నాడు ..ఏదో ఓసాకుతో మీనాక్షికి చీవాట్లూ, రవికి దెబ్బలూ తగుల్తున్నాయి!

ఓరోజు, జయా వాళ్ళింటి కెళ్ళొచ్చేసరికి ఇంట్లో ఏదోగొడవ జరుగుతోంది.

అమ్మమ్మగొంతు పెద్దగా విన్పిస్తోంది. బెదురుతూ లోపలికి వెళ్ళింది మీనాక్షి:

"పోనీలేమ్మా రాధా! ఇద్దరూ చిన్నపిల్లలే: రవిమాత్రం ప్రాయసముద్రుడా? అందులోనూ తల్లిలేని బిడ్డ... ఏదో ఆటల్లో.. "

అమ్మమ్మ మాటింకా పూర్తికాలేదు. రాధమ్మత్తయ్య కేకలు మిన్నుముట్టాయి:

"...అలా అని ఎంత ఓదార్చుకున్నా అల్లరికి హద్దుపద్దూ వుండక్కర్లా? ఈ రోజు కొరికినా, నోరు మూసుకు వూరుకుంటే, రేపు రగలరానిచో చెక్కడేనా తగిలేలా కొడతాడు. నా బిడ్డను పోగొట్టుకోవాల్సిందే కదూ?"

"అంత పెద్ద అపశకునమ్మాట లెందుకమ్మా? ఇప్పుడేమయిందనీ?"

"ఇంకా ఏం కావాలి? మీరు పెద్దవాళ్ళనే గానీ, అత్తయ్యా. . ఒక కంట్లో నీరూ, మరో కంట్లో పాలూ మీకు ..ఛీ..."

మీనాక్షి మెల్లిగా అమ్మమ్మ వెనకగా వచ్చి నిలబడి పమిటకొంగు నలుపుతోంది రాధమ్మకు మరింత ఆసరా చిక్కింది

"చూశారా! వయసొస్తున్న ఆడపిల్ల... అలా వూరువూరంతా చుట్టివస్తోంది. అదేమని అడిగే పాపాత్ముల్లేరు... ఆ మాటంటే నేను చెడ్డదాన్ని అవునా!"

అమ్మమ్మ ఏదో చెప్పబోయింది మామయ్య గర్జించాడు అమ్మా నీ మనవరాలి మీద మనవడి మీదా, నీకు ఎక్కువ ప్రేమవుంటే వుండొచ్చుగానీ, వాళ్ళనలా తల్లిలేని పిల్లలనే సాకుతో హద్దుపద్దు లేకుండా తయారుచేస్తున్నావు... రాధ మాటల్లో తప్పేముందీ"

అమ్మమ్మ పెద్దగా ఏడ్చింది "అయితే మీ ఇష్టం వచ్చినట్లు దండించండిరా వాళ్ళిద్దర్నీ! తల్లేనాడు చచ్చిందో, వాళ్ళకు తండ్రి వున్నా లేనివాడు కావటంతో, అనాదే. దిక్కులేని వాళ్ళయ్యారు వాళ్ళిద్దరూ!"

ఇక ఆమె అక్కడ వుండకుండా వచ్చింది పక్కగదిలోకి.

(సశేషం)

Printed and Published by Sri A Sudhakar Rao for Yuva Concerns and Printed at Yuva Press, 5-9-88 public Garden Road, Hyderabad-1. Controlling Editor Sri "CHAKRAPANI."